ప్రత్యేక రక్షణ చర్యలు తీసుకోవాలి



వైద్యశాలల్లో డాక్టర్లు, మహిళా సిబ్బంది రక్షణకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టాలి. కొన్ని సందర్భాల్లో రోగులు మరణిస్తే సరైన వైద్యం అందించలేదని డాక్టర్లపై దాడులకు పాల్పడుతున్నారు. ఇతర రాష్ట్రాల నుంచి వస్తున్న వైద్య విద్యార్థుల రక్షణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలి. వారికి పూర్తి భద్రత అందించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. వైద్య శాలల్లో మహిళా డాక్టర్లు, సిబ్బందికి ప్రత్యేక గదులు కేటాయించాలి.

– డాక్టర్ రూత్ రాణి, వైద్యురాలు, పొన్నూరు



రక్షణ కల్పించాలి

విధుల్లో ఉండే వైద్యులకు, వైద్య ఆరోగ్యశాఖ సిబ్బందికి రక్షణ కల్పించాలి. రక్షణ లేకుంటే విధులను ప్రశాంత వాతావరణంలో నిర్వహించడం కష్టం. 24 గంటలూ ఆస్పత్రుల్లో విధులు నిర్వర్తించే సమయంలో రాత్రిళ్లు ఇబ్బందులు తలెత్తుతుంటాయి. అలాంటి సమయంలో సత్వర సాయం అందేలా ప్రత్యేక రక్షణ కల్పించాలి. అదేవిధంగా నైట్‌వాచ్ మెన్లను ఆస్పత్రులకు ఏర్పాటు చేయాలి.

– కె.స్రవంతి, వైద్యాధికారి, కోలోకేటెడ్ పీహెచ్‌సీ, ప్రత్తిపాడు



క్లుప్తంగా

గంజాయిపై సమాచారమివ్వండి



పొన్నూరు: పట్టణ పరిసర ప్రాంతాల్లో గంజాయి విక్రయాలు చేస్తున్న, సేవిస్తున్న వారి సమాచారం అందించాలని సీఐ పి. భాస్కర్ తెలిపారు. సమాచారం ఇచ్చిన వారి పేర్లు గోప్యంగా ఉంచుతామన్నారు. శనివారం పట్టణంలోని ఐ లాండ్ సెంటర్‌లో ఆయన వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా కారు యజమానులు, డ్రైవర్లకు పలు సూచనలు చేశారు. ఐ లాండ్ సెంటర్‌లో ట్రాఫిక్ సమస్య లేకుండా వాహనాలు పార్కింగ్ చేసుకోవాలని స్పష్టం చేశారు.

పొన్నూరు పట్టణ సీఐగా రవికిరణ్



పొన్నూరు: పట్టణ పోలీస్ స్టేషన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా కె.రవి కిరణ్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన గతంలో గూడూరు రెండో పట్టణ పోలీస్ స్టేషన్ సీఐగా పనిచేసి బదిలీపై పొన్నూరుకు వచ్చారు. ప్రస్తుతం సీఐగా పనిచేసిన పి.భాస్కర్ రేంజ్ కార్యాలయంలో రిపోర్ట్ చేసినట్లు తెలిసింది.

వలంటీర్లను ఆదుకోవాలి

పొన్నూరు: గత ఐదేళ్ల ప్రజలకు విశిష్ట సేవలు అందించిన వలంటీర్లను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని, వారికి కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీని నెరవేర్చాలని పొన్నూరు కాంగ్రెస్ ఇన్‌చార్జి జక్కా రవీంద్రనాథ్ శనివారం ప్రకటనలో డిమాండ్ చేశారు. వలంటీర్ వ్యవస్థపై ఒక నిర్ణయం తీసుకోకపోవడంతో లక్షలాది వలంటీర్లు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. ఎన్నికల ముందు ఎన్డీఏ కూటమి వలంటీర్ల గౌరవ వేతనం రూ.10 వేలు చేసి, కొనసాగిస్తామని హామీ ఇచ్చినట్లు చెప్పారు.

నిబంధనల మేరకు సవరణ



పొన్నూరు: ఎన్నికల కమిషన్ జారీ చేసిన షెడ్యూల్ ప్రకారం బీఎల్వోలు ఓటర్ల జాబితాలో సవరణలు చేయాలని, కమిషన్ నిబంధనలు తప్పకపాటించాలని ఎన్నికల విభాగం డీటీ ఫణికుమార్ తెలిపారు. మండలంలోని బీఎల్వోలతో సమావేశం నిర్వహించారు. సర్వే అంశాలను వివరించారు. ఎన్నికల సీనియర్ అసిస్టెంట్ ఆనందరావు, ఆపరేటర్ లాల్, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థుల్లో పోటీతత్వాన్ని పెంపొందించాలి

గుంటూరు ఎడ్యుకేషన్: విద్యార్థుల్లో పోటీతత్వాన్ని పెంపొందించాలని సమగ్ర శిక్ష అదనపు ప్రాజెక్టు సమన్వయకర్త జి.విజయలక్ష్మి పేర్కొన్నారు. శనివారం పాత బస్టాండ్ సెంటర్‌లోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో వారధి ఫౌండేషన్ ఆధ్వర్యంలో వ్యాసరచన, వక్తృత్వ, బృంద చర్చ అంశాల్లో జిల్లాస్థాయి వార్షిక పోటీలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఏపీసీ విజయలక్ష్మి మాట్లాడుతూ పోటీల్లో పాల్గొని మంచి ప్రతిభ కనబర్చిన విద్యార్థులు రాష్ట్ర స్థాయిలోనూ ప్రతిభ చాటాలని సూచించారు. ఈ సందర్భంగా 12 మండలాల నుంచి ఒక టీంగా వ్యాసరచన, పది మండలాల నుంచి మరొక టీంగా బృంద చర్చలో పాల్గొన్నారు. పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థి బృందాల్లో దుగ్గిరాల జెడ్పీ ఉన్నత పాఠశాల టీంను వ్యాసరచన, తెనాలిలోని ఎస్‌డీఐ మున్సిపల్ ఉన్నత పాఠశాల బృందాన్ని బృంద చర్చలో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేశారు. ఉర్దూ డీఐ షేక్ ఎండీ ఖాసిం పర్యవేక్షణలో జరిగిన పోటీలకు ఉపాధ్యాయులు మంగారావు, నాగార్జున, పాప, వసుంధరా దేవి న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు.

కృష్ణాకెనాల్ రైల్వే గేట్ వద్ద గుర్తు తెలియని మృతదేహం



లక్ష్మీపురం: కృష్ణాకెనాల్ రైల్వే గేట్ సమీపంలో శనివారం మధ్యాహ్నం ఒక గుర్తుతెలియని మృతదేహాన్ని గుర్తించారు. రైల్వే జీఆర్పీ సీఐ అంజిబాబు తెలిపిన వివరాలు.. కృష్ణాకెనాల్ రైల్వే గేట్ సమీపంలో గుర్తు తెలియని మృతదేహం ఉన్నట్లు సమాచారం రావడంతో ఘటన స్థలానికి వెళ్లి మృతదేహాన్ని పరిశీలించారు. రైలు నుంచి జారీ పడినట్లు ఉందని అనుమానం వ్యక్తం చేశారు. ఎలాంటి ఆధారాలు లభ్యం కాక పోవడంతో గుర్తు తెలియని మృతదేహం కింద కేసు నమోదు చేసి ప్రభుత్వ సమగ్రాస్పత్రికి తరలించారు. మృతుడు బిస్కెట్ కలర్ ప్యాంటు, లైట్ స్కై బ్లూ కలర్ ఫుల్ హ్యాండ్ షర్ట్ ధరించి ఉన్నట్లు వివరించారు. మృతుడి ఆచూకి తెలిసిన వారు 9440627546, 9550523485 నెంబరులలో సంప్రదించాలని కోరారు.

భరోసా మాయం.. సేవకు మంగళం

- సొసైటీల ద్వారా ఎరువులు, పురుగు మందుల విక్రయం
- నిరుపయోగంగా మారనున్న రైతు సేవా కేంద్రాలుగా మారిన ఆర్బీకేలు
- ప్రైవేటుకు పట్టం కడుతూ..రైతుకు భారం మోపుతూ కూటమి ప్రభుత్వం నిర్ణయం



రైతు భరోసా కేంద్రం



సొసైటీలో నిల్వ చేసిన ఎరువులు

పొన్నూరు: గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో రైతులకు ఎన్నో విధాలుగా అండగా నిలిచిన రైతు భరోసా కేంద్రాలను నిర్వీర్యం చేసే దిశగా ప్రస్తుత కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తోంది. వాటికి మంగళం పాడే పనిలో పడింది. మాజీ ముఖ్య మంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రవేశ పెట్టిన ఆర్బీకేల్లోనే రైతులకు అనేక రకాల సేవలందించారు. ప్రస్తుత ప్రభుత్వం ఆర్బీకే సేవలకు స్వస్తి చెప్పి, ప్రైవేటు వ్యాపారులను ప్రోత్సహించే దిశగా చర్యలు చేపట్టింది. వ్యవసాయమే జీవనాధారమైన పొన్నూరు మండల వ్యాప్తంగా 22 ఆర్బీకేలను ఏర్పాటు చేశారు. ఎరువులు, పురుగు మందులు దళారుల ప్రమేయం లేకుండా నేరుగా తక్కువ ధరకు ఆర్బీకేల్లో విక్రయించారు. కూటమి ప్రభుత్వం ఆర్బీకేలను రైతు సేవా కేంద్రాలుగా మార్పు చేసింది. వీటి ద్వారా ఎరువులు, పురుగు మందుల విక్రయాలను నిలిపివేసింది. కేవలం సొసైటీల్లోనే విక్రయించేలా చర్యలు తీసుకుంది. మండలంలోని 7 సహకార సంఘాల ద్వారా ప్రస్తుతం ఎరువులు, పురుగు మందుల విక్రయాలు చేస్తున్నారు. దీంతో ఆర్బీకేలు నిరుపయోగంగా మారడమే కాక రైతులు దూర ప్రాంతాలకు వెళ్లి ఎరువులు కొనుగోలు చేయాల్సి వస్తోంది. దీంతో రవాణా ఖర్చులు అదనపు భారం కానున్నాయి. అధిక ధరలకు కొనుగోలు చేయాల్సి వస్తోందని రైతుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది.

సొసైటీల ద్వారానే ఎరువుల విక్రయాలు

రైతు భరోసా కేంద్రాల ద్వారా ఎరువుల విక్రయాలు జరగడం లేదు. మండలంలోని 7 సొసైటీల ద్వారానే రైతులు ఎరువులను కొనుగోలు చేయాలి. రైతులకు సకాలంలో ఎరువులు అందించేలా చర్యలు చేపడుతున్నాం.

– వెంకట్రామయ్య, వ్యవసాయాధికారి, పొన్నూరు.

ప్రకృతి వ్యవసాయ పంటల పరిశీలన



పత్తి పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు, వ్యవసాయశాఖ అధికారులు

గుంటూరు రూరల్: లాం ఫామ్ వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు, వ్యవసాయశాఖ గుంటూరు, పల్నాడు జిల్లాల అధికారులతో కలిసి ప్రకృతి వ్యవసాయంలో సాగు చేసిన పత్తి పంటను శనివారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. నగర శివారులోని లాం గ్రామంలో రైతు అలవల కోటేశ్వరరావు 1.5 ఎకరాల్లో సాగు చేస్తున్న పత్తి పంటను పరిశీలించి, కంది, సజ్జ, కూరగాయలు అంతర పంటలుగా సాగు చేయడాన్ని గుర్తించి, అభినందించారు. ఈ విధానం వల్ల గులాబీ రంగు పురుగు ఉనికి లేకపోవడం, పంట ఆరోగ్యంగా ఉండటం గమనించారు. రైతు పాటించిన పద్ధతులు అడిగి తెలుసుకున్నారు. లాంఫాం ఏడీఆర్ దుర్గాప్రసాద్, శాస్త్రవేత్తలు, డీఏవో నున్న వెంకటేశ్వరరావు రైతుతో మాట్లాడి అతను పాటించిన యాజమాన్య పద్ధతులు తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ డీపీఎం రాజకుమారి, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

శివారు ప్రాంతాలకు తాగునీటి సరఫరా

నగర పాలక సంస్థ కమిషనర్ పి.శ్రీనివాసులు



సిబ్బందికి సూచనలు చేస్తున్న నగర పాలక సంస్థ కమిషనర్ శ్రీనివాసులు

గుంటూరు రూరల్: నగర శివారు ప్రాంతాల ప్రజలకు తాగునీటి సరఫరా చేసేలా నగరపాలక సంస్థ ఇంజినీరింగ్ అధికారులు చర్యలు తీసుకోవాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదేశించారు. శనివారం స్వర్ణభారతి నగర్‌లోని పలు ప్రాంతాల్లో తాగునీటి సరఫరా, పారిశుద్ధ్యం పనులను కమిషనర్ పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ నగర శివారు ప్రాంతాల్లో తాగునీటి సరఫరాకి సంబంధించి ప్రజల నుంచి పలు ఫిర్యాదులు అందుతున్నాయని చెప్పారు. ఆయా ప్రాంతాలకు తాగు నీటిని అందించేందుకు ఇంజినీరింగ్ అధికారులు ప్రత్యేక కార్యాచరణ సిద్ధం చేయాలని ఆదేశించారు. ప్రధాన పైప్ లైన్ల లీకులకు వెంటనే మరమ్మతులు చేసి, పూర్తి స్థాయిలో తాగునీరు సరఫరా జరిగేలా చూడాలన్నారు. రిజర్వాయర్ పరిధిలో తాగునీటి సరఫరా బాధ్యత ఏఈలదేనన్నారు. నీటి సరఫరా సమయాన్ని ఆయా ప్రాంతాలకు నివాసాలు, జనాభా మేరకు రేషనలైజేషన్ చేయాలని చెప్పారు. ప్రతి ఇంటి నుంచి నిర్దేశిత సమయంలో చెత్త సేకరణ జరగాలని, రోడ్లు, కాల్వల్లో వ్యర్థాలు లేకుండా ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలన్నారు. ఖాళీ స్థలాల్లో పిచ్చి మొక్కల తొలగింపునకు రెవెన్యూ సిబ్బందితో సమన్వయం చేసుకొని సదరు యజమానులకు తెలియజెప్పాలని, లేకుంటే చట్టపరంగా అపరాధ రుసుం విధిస్తామని తెలిపారు. ప్రతి సచివాలయం పరిధిలో నూరు శాతం ఆస్తి పన్ను వసూలు, రోడ్ల మార్జిన్లు, డ్రెయిన్ల ఆక్రమణపై అధికారులకు నిర్దేశాలు చేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ బి.స్మిత పద్మజ, డీఈఈ హనీఫ్, ఏఈ అనూష, శానిటరీ సూపర్‌వైజర్ సోమశేఖర్, ఇన్‌స్పెక్టర్ డేవిడ్, ఆర్ఐ శ్యామ్, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఆవిష్కరణలు కావాలి సమాజ హితం



మెమెంటోలు అందిస్తున్న చైర్మన్ సుబ్బారావు

ప్రత్తిపాడు: విద్యార్థులు ఆవిష్కరణలు సమాజ హితానికి ఉపయోగపడేలా ఉండాలని కిట్స్ కళాశాల చైర్మన్ కోయి సుబ్బారావు అన్నారు. వట్టిచెరుకూరు మండలం వింజనంపాడులోని కిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో మూడవ సంవత్సరం ఐటీ విద్యార్థులకు ఐవోటీ నందు 36 గంటల హ్యాకథాన్‌ను నిర్వహించారు. హ్యాక్ బోట్స్ సీఈవో మహేశ్ ఆధ్వర్యంలో జరిగిన హ్యాక థాన్‌లో 43 టీంలు పాల్గొన్నాయి. అగ్రి విజన్, డ్రోన్ రెస్క్, బేబీ మానిటరింగ్, అథ్లెటిక్ వేర్, వీటీవోఎల్ ఐడియాతో స్మార్ట్ ఫైర్ ఎక్స్‌టింగ్ విషర్.. వంటి అనేక రకాల ఆవిష్కరణలను విద్యార్థులు రూపొందించారు. జ్యూరీ ప్రతినిధులుగా వివిధ సాఫ్ట్‌వేర్ కంపెనీలకు చెందిన సీఈవోలు కిరణ్, పవన్ వ్యవహరించారు. ఈ సందర్భంగా చైర్మన్ సుబ్బారావు మాట్లాడుతూ మారుతున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని విద్యార్థులు అందిపుచ్చుకుని వినూత్న ప్రయోగాలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి కోయి శేఖర్, ప్రిన్సిపల్ డాక్టర్ పి.బాబు తదితరులున్నారు. జ్యూరీ ప్రతినిధులను కళాశాల చైర్మన్ మెమెంటోలతో సత్కరించారు.

వరాహం.. స్వైర విహారం



ప్రత్తిపాడు: పంచాయతీ అధికారులు వరాహాలను కట్టడి చేయడంలో పూర్తిగా విఫలమవుతున్నారు. ప్రజలు ప్రాణాంతక మెదడువాపు వ్యాధి బారిన పడే అవకాశం ఉందంటూ ఓ పక్క వైద్య ఆరోగ్య శాఖ నెత్తీ నోరుబాదుకుంటున్నా పంచాయతీ అధికారులు దృష్టిసారించడంలేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రత్తిపాడుతో పాటు యనమదల.. వంటి పలు పంచాయతీల్లో పందుల గుంపులు విచ్చలవిడిగా సంచరిస్తూ దర్శనమిచ్చాయి. చెత్తా, చెదారాలలో కలియతిరుగుతూ ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. ప్రత్తిపాడు గ్రామంలో పందుల సంచారాన్ని నిషేధిస్తూ గతంలో పంచాయతీ అధికారులు స్పష్టమైన ఆదేశాలు జారీచేశారు. కాపరులను పిలిపించి హెచ్చరికలు కూడా చేశారు. అయినా.. పందులను విచ్చలవిడిగా గ్రామంలోకి వదిలేస్తున్నారు. అధికారులు స్పందించి, తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

‘చలపతి’లో సదస్సు ముగింపు



విద్యార్థులతో కళాశాల యాజమాన్యం

గుంటూరు రూరల్: ప్రతి విద్యార్థి సాంకేతిక నైపుణ్యతను వినియోగించుకుని సమాజహితమైన ఆవిష్కరణలు చేయాలని సీఎస్ కెడెన్జ్ సంస్థ సీఈవో ఈఆర్ వైవీడీ చంద్రశేఖర్ పేర్కొన్నారు. శనివారం నగర శివారులోని చలపతి ఇంజినీరింగ్ కళాశాలలో ఆరు రోజులుగా జరుగుతున్న డెవాప్స్ ఇన్ ఐటీ సెక్టార్ శిక్షణ సదస్సు ముగింపు కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ప్రస్తుత పోటీ ప్రపంచంలో ప్రతి నిమిషాన్ని సద్వినియోగించుకోవాలన్నారు. ఇటువంటి శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్న కళాశాల యాజమాన్యాన్ని అభినందించారు. కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ వై.సుజిత్ కుమార్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి సాఫ్ట్ వేర్‌ను ఉపయోగించి, నూతన ప్రాజెక్టలను తయారు చేయడం, ప్రాడక్ట్‌లో మార్పులు చేయడం తెలుసుకోవచ్చన్నారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.చంద్రశేఖర్ విద్యార్థులకు పలు ప్రాజెక్టల తయారీ పోటీలను నిర్వహించి, విజేతలకు బహుమతులు, సర్టిఫికెట్స్ ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతి జె.భార్గవ్, 120 మంది విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

సెంటిమెంట్‌తో కొట్టారు..!

- ఎస్ఎంసీ చైర్మన్ మనసును ‘రాజీ’పెట్టారు
- చక్రం తిప్పిన మండలానికి చెందిన ఓ మహిళా అధికారి

ప్రత్తిపాడు: ‘మీరు రాజీనామా చేయకపోతే ఇన్‌చార్జి హెచ్ఎం ఉద్యోగం ఊడుతుంది.’ అని సానుభూతి మాటలు చెప్పారు. ఉద్యోగం పోతే ఆయనతో పాటు తన కుటుంబ మంతా ఇబ్బంది పడుతుందని సెంటిమెంట్ వర్కవుట్ చేశారు. మాటలు చెప్పడంలో నిష్ణాతులైన సంబంధిత అధికారులు తమ మాటల మాయాజాలంతో చైర్మన్ మనసును ‘రాజీ’పెట్టారు. తమకు కావలసిన రాజీనామాను చక్కగా కూల్‌గా చేయించేసుకున్నారు.

ప్రత్తిపాడు మండలం తిక్కిరెడ్డిపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈ నెల 8న జరిగిన ఎస్ఎంసీ ఎన్నిక నిబంధనల ప్రకారం జరగలేదని, కోరం లేకపోయినా చైర్మన్, వైస్‌చైర్మన్ ఎన్నిక నిర్వహించారంటూ వారం కిందట ఆ గ్రామ టీడీపీ సర్పంచ్‌తో పాటు పలువురు విద్యార్థుల తల్లిదండ్రులు పాఠశాల ఉపాధ్యాయులపై ఫైర్ అయిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో కొందరు కీలక టీడీపీ నేతలు సంబంధిత శాఖకు చెందిన ఓ అధికారిని కలిసి చైర్మన్‌ను మార్చాల్సిందేనని పట్టుబట్టారు. దీంతో ఏం చేయాలో పాలుపోని సదరు అధికారి శనివారం పాఠశాలకు వెళ్లారు. ఎస్ఎంసీ చైర్మన్‌గా ఎన్నికైన స్థానిక దళితవాడకు చెందిన బిల్లా ఫిలిప్‌ను పాఠశాలకు పిలిపించి మైండ్ వాష్ చేశారు. హెచ్ఎంతో పాటు అధికారులు సెంటిమెంట్ డైలాగ్స్‌ను సమపాళ్లలో పండించి చైర్మన్ గిరీకి ఫిలిప్ తనంతటతానుగా రాజీనామా చేసేలా చేశారు. దీంతో ఇప్పుడు పాఠశాలలో మరోసారి ఎస్ఎంసీ ఎన్నికల నిర్వహణకు మార్గం సుగమం అయ్యింది.

ఉద్యోగం పోతుందన్నారని రాజీనామా చేశాను

నేను రాజీనామా చేయకపోతే ఇన్‌చార్జి హెచ్ఎం ఉద్యోగం పోతుందని, మండలం నుంచి వచ్చిన అధికారి నాకు చెప్పారు. ఇప్పటికే ఆయనను తీసెయ్యమని పేపర్లలో వచ్చిందని తెలిపారు. తన వల్ల ఆయన ఉద్యోగం పోవడం ఎందుకని రాజీనామా లేఖను రాసిచ్చాను.

–బి.ఫిలిప్, ఎస్ఎంసీ చైర్మన్, తిక్కిరెడ్డిపాలెం హైస్కూల్.

విధులకు ఆటంకం కలిగించిన వారిపై కేసు

పట్నంబజారు: రిజిస్ట్రేషన్ కార్యాలయంలోకి వెళ్లి డాక్యుమెంట్లు చించి, అధికారుల విధులకు ఆటంకం కలిగించిన ఇద్దరిపై కేసు నమోదైంది. నగరంపాలెం పోలీసులు తెలిపిన వివరాలు.. డొంకరోడ్డుకు చెందిన లింగయ్యకి ముగ్గురు కుమారులు. పెద్దకుమారుడు శ్రీరామమూర్తికి తన ఇంటిని రిజిస్ట్రేషన్ చేయించేందుకు శనివారం సబ్ రిజిస్ట్రారు కార్యాలయానికి వచ్చారు. దీంతో మిగిలిన ఇద్దరు సుధాకర్, అంకయ్య ఆస్తిని పెద్ద కుమారుడికి ఎలా రాస్తావంటూ రిజిస్ట్రరు కార్యాలయంలోకి ప్రవేశించి కాగితాలు చించి వేసి అధికారుల విధులకు ఆటంకం కలిగించారు. జాయింట్ రిజిస్ట్రారు –1 ఎం.విజయప్రసాద్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తి ఆత్మహత్య

పట్నంబజారు: ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటనపై కేసు నమోదైంది. కొత్తపేట పోలీసులు తెలిపిన వివరాలు.. రైలుపేటలోని శ్రీలేఖ లాడ్జి నిర్వహించే పి. ఆదినారాయణ(40) ఆర్థిక ఇబ్బందులతో గత కొంతకాలంగా మానసికంగా బాధపడుతున్నాడు. భార్య మల్లేశ్వరి అనారోగ్యంతో ఉండటంతో మనస్తాపానికి గురైన ఆదినారాయణ ఈనెల 23న లాడ్జిలో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి భార్య మల్లేశ్వరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

కండక్టర్ వద్ద నగదు మాయంపై కేసు

పట్నంబజారు: ఆర్టీసీ బస్సు కండక్టర్ వద్ద ఉన్న నగదు మాయమైన ఘటనపై కేసు నమోదైంది. నగరంపాలెం పోలీసులు తెలిపిన వివరాలు.. డిపో–1 కండక్టర్‌గా పనిచేసే ఆదిలక్ష్మి, పిడుగురాళ్ల విధుల నిమిత్తం వెళ్లి తిరిగి వస్తున్నారు. ఐటీసీ వద్దకు వచ్చే సరికి తన బ్యాగులోని రూ.13 వేలు నగదు పోయినట్లు గుర్తించారు. కండక్టర్ ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు.

తహసీల్దారు లేరండి.. వచ్చాకే రండి..!



పొన్నూరు తహసీల్దారు కార్యాలయం

పొన్నూరు: పూర్తిస్థాయి తహసీల్దారు లేకపోవడంతో మండల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. వివిధ సమస్యలపై కార్యాలయానికి వచ్చే వారి అర్జీలు పరిష్కారానికి నోచుకోవడం లేదు. ఇప్పటి వరకు తహసీల్దారుగా బాధ్యతలు నిర్వహించిన నారాయణ సింగ్ గత నెల 26న బదిలీ అయ్యారు. ఆయన పనిచేసిన నాలుగు నెలల్లో ఎన్నికల విధులు మాత్రమే నిర్వహించడంతో ప్రజలు పెట్టుకున్న అర్జీలు మూలకు చేరాయి. డెప్యూటీ తహసీల్దారు ప్రశాంతి బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఇటీవల ప్రభుత్వం చేపట్టిన బదిలీల్లో పొన్నూరుకు తహసీల్దార్‌ను కేటాయించలేదు. ప్రతి సోమవారం నిర్వహించే గ్రీవెన్స్‌తో పాటు, నిత్యం అనేక సమస్యలతో మండల ప్రజలు కార్యాలయానికి వస్తున్నారు. తహసీల్దారు లేరని, వచ్చాక రావాలని కార్యాలయ సిబ్బంది చెబుతుండటంతో ప్రజలు అసౌకర్యానికి గురవుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి, మండల తహసీల్దారు నియామకం చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

నేడు దాశరథి సినీ సంగీత విభావరి



మాట్లాడుతున్న సాయి లక్కరాజు

తెనాలి: నిజాం నిరంకుశానికి వ్యతిరేకంగా కలాన్ని దూసి జైలుజీవితం అనుభవించి తర్వాత సినీకవిగా రాణించి, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ఆస్థానకవి దాశరథి కృష్ణమాచార్యులు సినీ సంగీత విభావరిని తెనాలిలో ఆదివారం సాయంత్రం 6.30 గంటలకు నిర్వహించనున్నారు. పట్టణానికి చెందిన సంగీత, సాహిత్య, సాంస్కృతిక సంస్థ స్వరలయ వేదిక ఆధ్వర్యంలో దాశరథి శతజయంతి సంవత్సరం సందర్భంగా ఈ కార్యక్రమం ఏర్పాటు చేసినట్టు సంస్థ వ్యవస్థాపకుడు సాయి లక్కరాజు శనివారం సాయంత్రం చెప్పారు.

స్థానిక శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో జరిగే సంగీత విభావరిలో కత్తి సౌజన్య (తెనాలి), సత్యవర్ధన్ (హైదరాబాద్)లు, దాశరథి రాసిన ఆణిముత్యాలనదగ్గ ‘ఏ దివిలో విరిసిన పారిజాతమో’, ‘ఖుషీఖుషీగా నవ్వుతూ’ వంటి పాటలను ఆలపిస్తారని వివరించారు. సంగీతాభిమానులు జయప్రదం చేయాలని కోరారు. వీరితో విశ్రాంత తపాల అధికారి తిరుమలరావు, బ్యాంక్ అధికారి రవిమోహన్ ఉన్నారు.

ఆర్ట్ గ్యాలరీని తిలకించిన విద్యార్థులు

తెనాలి: రూరల్ మండలంలోని ఆటోనగర్ శివారులో నూతనంగా ఏర్పాటుచేసిన కాటూరి ఆర్ట్ గ్యాలరీని శనివారం పట్టణంలోని రెయిన్‌బో స్కూలు విద్యార్థులు సందర్శించారు. స్థానిక శిల్పకళాకారులు కాటూరి వెంకటేశ్వరరావు, కుమారులు రవిచంద్ర, శ్రీహర్షలు వివిధ ప్రక్రియల్లో శిల్పకళా రూపాలను తీర్చిదిద్దుతున్నారు. వీరు రూపొందించిన జాతినేతల నుంచి రాజకీయ నేతలు, సాహితీవేత్తలకు చెందిన 150 శిల్పాలతో కూడిన ఆర్ట్ గ్యాలరీని ఇటీవల రాష్ట్ర పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ప్రారంభించిన విషయం తెలిసిందే. ఆర్ట్ గ్యాలరీని స్థానికులు తిలకించాల్సిందిగా శిల్పులు ఇచ్చిన పిలుపుకు రెయిన్‌బో స్కూలు యాజమాన్యం దొడ్డక ఆదినారాయణ స్పందించారు. పాఠశాల విద్యార్థులు అక్కడి శిల్పాలను ఆసక్తిగా తిలకించారు. రెయిన్‌బో స్కూలు యాజమాన్యానికి కాటూరి కుటుంబం ధన్యవాదాలను తెలియజేసింది.

ఏ భాషాకైన జానపద సాహిత్యమే మూలం

మేధావుల ఫోరం కన్వీనర్ పి.ఎస్.మూర్తి



లక్ష్మీపురం: జానపద సాహిత్యం, కళలు ఒక తరం నుంచి మరో తరానికి వారసత్వంగా అందుతాయని ప్రపంచంలోని ఏ భాషా సారస్వతానికైనా అందులోని జానపద సాహిత్యమే మూలమని మేధావుల ఫోరం కన్వీనర్ పి.ఎస్.మూర్తి అన్నారు. స్థానిక అరండల్‌పేటలోని అవగాహన సంస్థ ఆధ్వర్యంలో సదస్సు శనివారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జానపద విజ్ఞానంలో కళలు ప్రధానమైన భాగమని సంగీతం, నత్యం, అభినయం ఉండే ప్రదర్శన కళలన్నీ ఈ విభాగం కిందికే వస్తాయన్నారు. గ్రామీణులు, గిరిజనులు కాయ కష్టంతో ఉల్లాసం పొందటానికి, విజ్ఞానం, వినోదానికి ఆవిర్భవించిన సహజ కళలివి అన్నారు. ప్రజా గాయకుడు గని, సంస్థ కార్యదర్శి కొండాశివరామిరెడ్డి మాట్లాడుతూ తెలుగు రాష్ట్రాల జానపద సాంస్కృతిక కళలకు ఐదు వేల సంవత్సరాల చరిత్ర ఉందన్నారు. ఒగ్గు కథ, మల్లన్న కథలు, బీరప్ప కథలు, యెల్లమ్మ కథలు తెలంగాణ ప్రాంతంలో బహుళ ప్రచారంలో ఉంటున్నాయన్నారు. అనంతరం రచయిత్రి సుజాత, బిళ్ల అశోక్, మల్లేశ్వరరావు, మొగిలి ప్రసంగించారు.

కొత్త చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

తెనాలిరూరల్: జులై 1వ తేదీ నుంచి అమల్లోకి వచ్చిన కొత్త చట్టాలపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని ప్యానల్ న్యాయవాది ఖాదర్ హుస్సేన్ అన్నారు. తెనాలి న్యాయ సేవాధికార సంస్థ అధ్వర్యంలో శనివారం సాయంత్రం కొత్తపేటలోని మున్సిపల్ పాఠశాలలో న్యాయ వి/జ్ఞానసదస్సులో ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు చట్టాలపై అవగాహన కలిగించేందుకు న్యాయ విజ్ఞానసదస్సులు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. పారాలీగల్ వలంటీర్లు అజ్గర్ అలీ, ఎస్. మొహిద్దీన్ మాట్లాడారు. పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు సుందరరావు, ఉపాధ్యాయులు మస్తాన్‌రావు, నాగేశ్వరరావు పర్యవేక్షించారు.

పవర్ లిఫ్టింగ్‌లో చంద్రికకు పతకాలు



మంగళగిరి: పవర్ లిఫ్టింగ్ పోటీలలో చంద్రిక ప్రతిభ చూపింది. ఈ నెల 20వ తేదీ నుంచి 25వ కోల్‌కతాలో నిర్వహిస్తున్న సీనియర్ నేషనల్ పోటీలు నిర్వహించారు. శనివారం పోటీలతో మహిళల 84 కేజీల విభాగంలో మంగళగిరి నుంచి బొల్లినేని చంద్రిక ఓవరాల్ బ్రాంజ్ మెడల్ ఇంటర్‌స్టేట్ సిల్వర్ మెడల్ సాధించినట్లు అసోషియేషన్ జిల్లా అధ్యక్షుడు కొమ్మాకుల విజయభాస్కరావు, కోచ్ షేక్ సంధానిలు తెలిపారు. స్క్వాట్ 250 కేజీలలో సిల్వర్ మెడల్ బెంచ్ ప్రెస్ 110 కేజీలు, డెడ్ లిఫ్ట్ 180 కేజీలు బ్రాంజ్ మెడల్, ఓవరాల్ 547 కేజీలు బ్రాంజ్ మెడల్ ఇంటర్ స్టేట్ సిల్వర్ మెడల్ సాధించినట్లు తెలిపారు. పతకాలు సాధించిన చంద్రికను అసోషియేషన్ ప్రతినిధులు అభినందించారు.